క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు అరట్లకట్ట విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం శ్రీనివాస్, పీడీ కౌర్, అధ్యాపకులు

కరప: రాజమహేంద్రవరంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 17 ఫుట్‌బాల్ గరల్స్ విభాగంలో ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర జట్టుకు ఎంపికై నట్లు హెచ్‌ఎం శ్రీనివాస్ కుమార్ తెలిపారు. 9వ తరగతి చదువుతున్న సృజన, అపర్ణ, మాలాశ్రీ రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారని, వారు ఈ నెల 22న కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో ఉమ్మడి జిల్లా జట్టు తరఫున పాల్గొంటారన్నారు. వీరికి తర్ఫీదు ఇచ్చిన పీడీ జీజేఆర్ కౌర్‌ను, విద్యార్థినులను గ్రామపెద్దలు, విద్యాకమిటీ చైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వృద్ధునికి చేయూత



చేయూత సంస్థ అధినేత రవికుమార్‌కు కృతజ్ఞతలు చెప్తున్న వృద్ధుడు

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): జీవిత చరమాంకంలో విధితో పోరాడుతున్న ఓ వృద్ధుడు స్థానిక జీజీహెచ్ ప్రభుత్వాస్పత్రి ఎదుట ఫుట్‌పాత్‌పై ఎండకు ఎండి.. వానకు తడిసి.. దోమలతో అవస్థ పడుతున్నారు. ఈ సమాచారం అందుకున్న చేయూత సంస్థ అధినేత రవి తన సిబ్బందిని అక్కడికి పంపించారు. వారు ఆయనను తీసుకురాగా జుట్టు కత్తిరించి స్నానం చేయించారు. అనంతరం అంబులెన్స్ సౌకర్యం కల్పించి గురువారం రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ కోశాధికారి ఆదిత్య హాస్పిటల్ అధినేత ఉదయ్ చక్రవర్తి సహకారంతో అత్యవసర చికిత్స చేయించారు. అనంతరం కాకినాడ వృద్ధాశ్రమానికి తరలించగా డాక్టర్ ఫరా ఆయన పూర్తి బాధ్యతను స్వీకరించారు.

మారథాన్‌లో పీఆర్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అనితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఆంజనేయులు

బాలాజీచెరువు: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ నిర్వహించిన 5కే మారథాన్ పోటీల్లో పీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ చూపింది. బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సీహెచ్ అనితను రూ.10 వేల నగదుతో పాటు స్వర్ణ పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు అభినందించారు.

దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: ఆటో, మోటార్ క్యాబ్, ట్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయానికి ఈ నెల 17 నుంచి 19 వరకూ కొత్త దరఖాస్తులు గ్రామ, వార్డు సచివాలయాల్లో స్వీకరించనున్నట్టు ఎంపీడీఓ కె.సాయినవీన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 22న క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది జాబితాను 24న ప్రకటిస్తామన్నారు. అర్హులకు అక్టోబర్ 1న రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తున్నారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కరప మండల అధికారుల ఫోన్‌నంబర్లు

ఎంపీడీఓ	9346790319
తహసీల్దార్	9849903908
ఈఓ పీఆర్ ఆర్డీ	9849352293
మండల ఇంజనీరింగ్ అధికారి	8886865417
మండల వ్యవసాయాధికారి	8331056589
ఎంఈఓ–1	8008293994
ఎంఈఓ–2	8919940656
హౌసింగ్ ఏఈఈ	7093930450
ఉపాధిపథకం ఏపీఓ	7093998259
వెలుగు ఏపీఎం	9959989273
ఎలక్ట్రికల్ ఏఈ	9440812638
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ	9603007219
ఇరిగేషన్ ఏఈఈ	9704651826
డ్రెయినేజీశాఖ ఏఈఈ	9963744219
ఆర్అండ్‌బి ఏఈఈ	9440818530
కరప పీహెచ్‌సీ డాక్టర్	8096940176
వేళంగి పీహెచ్‌సీ డాక్టర్	9962553545
పశుసంవర్ధకశాఖ ఏడీఏ	9490047668
నడకుదురు వెటర్నరీడాక్టర్	9652547579
వేళంగి వెటర్నరీ డాక్టర్	8332973558
అరట్లకట్ట వెటర్నరీ డాక్టర్	9494671642
ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్	9704512131
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	9492600313
కరప ఎస్ఐ	9440796557
తాళ్లరేవు ఎక్సైజు సీఐ	9440902407

మార్పు కోసం.. మీ చెంతకే!

- కాకినాడలో మొబైల్ ఐసీటీసీ సేవలు
- ఇంటి వద్దనే సుఖ వ్యాధుల పరీక్షలు
- అన్నీ ఉచితం.. గోప్యత పదిలం
- అశ్రద్ధ వద్దు.. ఇక మీదే ఆలస్యం..

కాకినాడ క్రైం: కాకినాడలో వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో ఏపీ సాక్స్ (రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంఘం) ఆధ్వర్యంలో సుఖవ్యాధుల నిర్ధారణకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రజలకు చేరువలో ఇంటి వద్దే ఈ పరీక్షలు చేస్తుండడం గమనార్హం. ఈ విషయంపై అవగాహన లేక పరీక్షలు చేయించుకునేందుకు ప్రజలు వెనకాడుతున్నారు. దీంతో వైద్య, ఆరోగ్యశాఖ స్వచ్ఛంద సంస్థల సాయంతో విస్తృత ప్రచారం చేస్తోంది. పూర్తి ఉచితంగా నిర్వహించే ఈ పరీక్షలను చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని ఆ శాఖ సూచిస్తోంది.

ఏమిటీ వాహనాలు?

మొబైల్ ఐసీటీసీ (ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్) వాహన సేవలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎన్ఏసీవో (నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్) పర్యవేక్షణలో సేవలందిస్తున్నాయి. కాకినాడలో ఓ వాహనం నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో పాటు సుఖ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, అవగాహన, కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

ఇవీ ప్రయోజనాలు

ఉచిత లైంగిక సంక్రమణ వ్యాధుల పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ఉచిత పరీక్షలు, పరీక్షల అనంతరం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. కనుగొన్న పాజిటివ్ కేసులను ఏఆర్‌టీ సెంటర్లకు సిఫార్సు చేస్తారు. లైంగికంగా సంక్రమించే హెచ్ఐవీ, హెపటైటిస్ బి, సి, సిఫిలిస్ వ్యాధులపై అవగాహన కల్పిస్తారు.



ఐసీటీసీ వాహనంలో రక్తపరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



పరీక్షల కోసం పేరు నమోదు చేయించుకుంటున్న వ్యక్తి

ప్రత్యేకతలు ..

హెచ్ఐవీ ర్యాపిడ్ టెస్టులు చేయడానికి ప్రత్యేక ల్యాబ్ సౌకర్యం, ప్రత్యేక క్యాబిన్, రక్త నమూనాలు భద్రపరిచే సదుపాయం, అందుబాటులో ఐఈసీ (ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్) మెటీరియల్. కౌన్సిలర్, ల్యాబ్ టెక్నీషియన్, హెల్పర్, డ్రైవర్ ఇలా నలుగురు ప్రత్యేక సిబ్బంది ఉంటారు. వీరంతా ఐసీటీసీ నిబంధనల ప్రకారం శిక్షణ పొందిన వారై ఉంటారు.

స్వచ్ఛంద సంస్థల సహకారంతో

కాకినాడలో చేంజెస్, ఉమా మనోవికాస కేంద్రం, లింక్ వర్కర్స్ స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమాలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నాయి. ఈ సంస్థలను ప్రివెన్షన్ యూనిట్లు అంటారు. ఇవి ఆ శాఖ పనికి తోడ్పాటునిస్తున్నాయి. ఆయా సంస్థల ప్రతినిధుల వాహనాలు వెళ్లిన చోట ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ప్రజల్ని పరీక్షలకు సమాయత్తం చేస్తున్నాయి. వెనకబడిన ప్రాంతాలు, అనారోగ్య పరిస్థితులు నిత్యం నమోదవుతున్న ప్రదేశాలు, పడుపు వృత్తి సాగే ప్రాంతాలలో ఈ వాహనాలు సేవలందిస్తాయి.

రెండు వారాల్లో వెయ్యి మందికి

కాకినాడలో రెండు వారాల్లో వెయ్యి మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో కొందరికి సిఫిలిస్ వ్యాధి నిర్ధారణ అయింది. వీరికి మరిన్ని పరీక్షల నిమిత్తం కాకినాడ ఏఆర్‌టీ కేంద్రానికి పంపారు. ప్రజల్లో ఈ సేవలపై హర్షం వ్యక్తమవుతోంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఇంటి వద్దకే వచ్చి నిర్వహిస్తున్న సుఖ వ్యాధుల నిర్ధారణ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రజల్లో అవగాహన కొరవడుతుండగా వారిని సమాయత్తం చేస్తున్నాం. మా ప్రయత్నం సత్ఫలితాలనిస్తోంది. ఇవి ర్యాపిడ్ పరీక్షలు. పాజిటివ్‌గా తేలితే పూర్తి స్థాయి నిర్ధారణ కోసం జీజీహెచ్‌కు రిఫర్ చేస్తారు. వారిపై ప్రత్యేక ఆరోగ్య పర్యవేక్షణ కొనసాగిస్తాం. సంస్థ తరఫున తోడ్పాటునందిస్తాం. పోషకాహారం నుంచి మందుల వరకు అన్ని సాయాలు అందిస్తాం. మా కౌన్సిలర్లు నిత్యం వారి మానసిక, ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షిస్తూ ఉంటారు.

– పి.దుర్గాభవాని, మేనేజర్, చేజెస్ స్వచ్ఛంద సేవా సంస్థ

వ్యక్తిగత గోప్యత పాటిస్తాం



మొబైల్ ఐసీటీసీ వాహనాలలో నిర్వహించే పరీక్షలు గోప్యత, నాణ్యత, రిజిస్ట్రేషన్ నిబంధనలకు లోబడి నిర్వహిస్తారు. ఆరుబయటే వాహనం నిలబెట్టి పరీక్షలు నిర్వహిస్తున్నా గోప్యతపై ఎటువంటి ధోకా లేదు. సాక్స్ అధికారులు వాహనాల పనితీరును క్రమం తప్పకుండా తనిఖీ చేస్తారు. ల్యాబ్ టెస్టుల కోసం ఎక్స్‌టర్నల్ క్వాలిటీ ఎసెస్‌మెంట్(ఈక్యూఏ) తప్పని సరిగా నిర్వహిస్తారు. నిర్ధారణ అయిన ప్రతి బాధితుడి ఆరోగ్య సమాచారానికి ప్రత్యేక రికార్డు నిర్వహిస్తాం. గోప్యత నిబంధనలకు లోబడి సాక్స్, ఎన్ఏసీవోకి సమర్పిస్తాం. డాక్టర్ రోణంకి రమేష్ పర్యవేక్షణలో కాకినాడలో మొబైల్ ఐసీటీసీ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

– డాక్టర్ నరసింహ నాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ

కలెక్టర్‌ను కలసిన రైస్ మిలర్ల కార్యవర్గం



కలెక్టర్‌ను కలుసుకున్న జిల్లా రైస్ మిల్లర్ల సంఘం కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఇటీవల నూతనంగా ఏర్పాటైన జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ తరఫున జిల్లా అధికారులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని సభ్యులు ఆయనకు హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సూర్య ప్రకాశరావు (సూరిబాబు), సెక్రటరీ మొగలి నాని, ట్రెజరర్ పెద్దిరెడ్ల బాబి, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ భైరవకృష్ణ, కాకినాడ ఏరియా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు రుద్రయ్య చౌదరి పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

కాకినాడ క్రైం: స్థానిక పళ్లంరాజు నగర్‌లోని ఓ అపార్టుమెంట్‌పై పోలీసులు దాడి చేసి పేకాడుతున్న 18 మందిని అదుపులోకి తీసుకున్నారు. త్రీ టౌన్ పోలీసులు నిర్వహించిన ఈ దాడిలో నిందితుల నుంచి నగదుతో పాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పొలాన్ని కాజేయాలని చూస్తున్నారు

- నకిలీ పత్రాలు సృష్టించారు
- వాటితో సొసైటీ రుణమూ తీసుకున్నారు
- బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలి
- వేళంగి రైతు ఆవేదన

కరప: తనకు సంక్రమించిన ఆస్తిని ఆక్రమించుకున్న వారిపై, అందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని, నకిలీపత్రాలతో సొసైటీ రుణం ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలం వేళంగి గ్రామానికి చెందిన రైతు గుబ్బల వీరపండు కలెక్టర్‌ను కోరాడు. ఈ మేరకు కరపలో విలేకర్లకు ఒక ప్రకటన విడుదల చేశారు. వీరపండు తల్లి దండ్రులు గుబ్బల కృష్ణ, సుబ్బయమ్మ వీలునామా ద్వారా వీరపండుకు సంక్రమించిన భూమి యండమూరులో వుంది. తల్లిదండ్రులు మరణించిన తరువాత వారసుల మధ్య తలెత్తిన వివాదంలో కోర్టు తీర్పు ద్వారా యండమూరులో ఎకరం భూమి వీరపండుకు సంక్రమించింది. దాని సరిహద్దు రైతు యండమూరు గ్రామానికి చెందిన మార్రెళ్ల వెంకట్రావు, మార్రెళ్ల విష్ణు మూర్తి, మార్రెళ్ల ఈశ్వర్రావులకు తన ఎకరం పంట పొలాన్ని సర్వే నెంబర్ 335/2, 337/2ఎలో నీరు కట్టుడానికి అప్పగించానని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారు తన పొలాన్ని సొంతం చేసుకోవాలన్న ఆలోచనతో నకిలీ పాస్ పుస్తకాలు తయారు చేయించడమే కాకుండా, తన అనుమతి లేకుండా వాటిపై సొసైటీలో రూ.1.6 లక్షల రుణం తీసుకున్నారని పేర్కొన్నాడు. పొలంలోకి వెళ్తున్న తనను వారు బెదిరిస్తున్నారని, చంపేస్తామంటున్నారని తెలిపాడు. ఈ విషయమై యండమూరు సర్పంచ్‌కు, జిల్లా కలెక్టర్‌కు, యండమూరు గ్రామ సహకార సంఘానికీ, మండలం పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్టు ప్రకటనలో పేర్కొన్నాడు. తనకు అన్యాయం చేసిన బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను, అధికారులను వీరపండు కోరాడు.



యండమూరులోని వరిచేనులో గుబ్బల వీరపండు

వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి



వివేకానంద విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సమితి సభ్యులు

బోట్‌క్లబ్: స్వామి వివేకానంద ప్రసంగాలు ప్రపంచ ప్రగతికి ఆదర్శమని మాజీ కౌన్సిలర్ దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. విశ్వదీప్తిగా నిలిచిన స్వామి వివేకానంద జీవితం యువతరానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. అమెరికా మహాసభలో ప్రియమైన సోదర సోదరీమణులారా అంటూ భారతదేశ మత సామరస్యాన్ని, వైవిధ్యాన్ని వివరించిన స్వామి వివేకానంద 1893 సెప్టెంబర్ 11న చేసిన ప్రసంగం ప్రపంచ ఆదర్శానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఆ ప్రసంగానికి 132 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వివేకా అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో వివేకానంద పార్కు ఆవరణలో గురువారం ఆయన కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. సమితి అధ్యక్షులు పెంకె సూకరాజు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా వివేకానంద ఆదర్శం అలవర్చుకోవడం సమాజ హితానికి మార్గదర్శకంగా భావించి తన సమితి పనిచేస్తోందన్నారు. అనంతరం డాక్టర్ ఆర్.రాజ్యలక్ష్మి విద్యార్థులకు పరీక్ష అట్టలు అందించారు. కార్యక్రమంలో సభ్యులు పిక్కి సత్తిబాబు, శివప్రసాద్, శ్రీధర్, జయలక్ష్మి, రంగన్న పాల్గొన్నారు.

వైభవంగా సత్యదత్త వ్రతాలు



శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో గోపూజలు చేస్తున్న భక్తులు



శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో సత్య దత్త వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

పిఠాపురం: ప్రముఖ దత్త క్షేత్రమైన స్థానిక శ్రీపాద శ్రీ వల్లభ మహా సంస్థానంలో బుధవారం సత్య దత్త వ్రతాలు కన్నుల పండువగా జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి సత్య దత్త వ్రతం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వ్రతాలు ఆచరించారు. ఆలయ గోశాలలో గోపూజ నిర్వహించారు. ఆలయ ఈఓ సౌజన్య ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

సరస్వతీ గానసభ అధ్యక్షుడిగా ముళ్లపూడి



సరస్వతీగాన సభ అధ్యక్షుడు నాగేశ్వరరావును అభినందిస్తున్న సంస్థ సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడలో పురాతనమైన సరస్వతీగాన సభ (సూర్యకళా మందిరం) సంస్థ అధ్యక్షుడిగా ప్రముఖ చంటిపిల్లల వైద్య నిపుణుడు ముళ్లపూడి నాగేశ్వరావు ఎన్నికయ్యారు. సంస్థ అధ్యక్షుడిగా పనిచేసిన కేవీఎస్ ఆంజనేయమూర్తి ఇటీవల మరణించడంతో సంస్థ కార్యవర్గం గురువారం సూర్యకళా మందిరంలో సమావేశం నిర్వహించి ముళ్లపూడిని అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన పేరును సంస్థ జీవితకాల అధ్యక్షులు కొమ్మిరెడ్డి శ్రీరామనరసింగరావు, కేవీవీ శర్మలు ప్రతిపాదించగా సభ్యులంతా ఆమోదించారు. సంస్థ ఉపాధ్యక్షుడు లక్క సత్యనారాయణ అధ్యక్షత వహించగా సంస్థ గౌరవాధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి, కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, సభ్యులు వెత్సా సత్యనారాయణ, ఆనంద్, గోవు కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు. అధ్యక్షుడు ముళ్లపూడిని ఈ సందర్భంగా సభ్యులు అభినందించారు.

మామిడి తోటల యాజమాన్యంపై శిక్షణ

జగ్గంపేట: మండలంలోని రాజపూడిలో రైతులకు మామిడి, జీడిమామిడి తోటల సమగ్ర యాజమాన్యం, తేనెటీగల పెంపకంపై గురువారం శిక్షణ ఇచ్చారు. డివిజన్ ఉద్యానశాఖ అధికారి శ్రీవల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా తరగతులకు కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం అధికారి ఎస్‌వీ రఘునందన్, ప్రగతి శీల తేనెటీగల పెంపకందారుడు రామరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మామిడి, జీడిమామిడి సాగులో తెగుళ్ల నివారణ, నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రఘునందన్ వివరించారు. తేనెటీగల పెంపకంపై రామరాజు అవగాహన కల్పించారు. రాజపూడి గ్రామ సర్పంచి బూసాల విష్ణు మూర్తి, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యంపై వీఏఏ, వీహెచ్ఏలకు శిక్షణ

తుని రూరల్: సమగ్ర అవగాహనతో రైతులకు సూక్ష్మ సేద్యంపై చైతన్యం తీసుకురావాలని కాకినాడ జిల్లా అధికారి జీవీవీ వరప్రసాద్ అన్నారు. మండలంలోని తేటగుంటలో ఉద్యాన అధికారి కె.సుజాత అధ్యక్షతన గురువారం ఉద్యానశాఖ అమలు చేస్తున్న పథకాలపై వీఏఏ, వీహెచ్ఏలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సూక్ష్మ సేద్యం అధికారి వరప్రసాద్ మాట్లాడుతూ బిందు, తుంపర సేద్యం పరికరాలు, రిజిస్ట్రేషన్లు, ఎరువులు వినియోగంపై సమగ్రంగా వివరించారు. ఎరువులను సూక్ష్మ సేద్యం ద్వారా పంటకు ఏవిధంగా పూర్తిస్థాయిలో అందించాలో డెమో నిర్వహించారు. ఆర్‌కేవీవై, ఎంఐడీహెచ్, కొబ్బరి డెవలప్‌మెంట్ బోర్డు, నేషనల్ ఇడిబుల్ ఆయిల్, ఆయిల్‌పామ్, నేషనల్ బాంబూ మిషన్, ఏపీఎంఐపీ, పీహెచ్‌ఎం, ఈపంట తదితర పథకాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తుని, కోటనందూరు, తొండంగి మండలాలకు చెందిన వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.



సూక్ష్మ సేద్యం పరికరాల వినియోగాన్ని వివరిస్తున్న జిల్లా అధికారి వరప్రసాద్

కమిషనరేట్ ముట్టడికి తరలిరావాలి

పెద్దాపురం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 15న చేపట్టనున్న రాష్ట్ర కార్మిక శాఖ కమిషనరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక వరహాయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో గురువారం సీఐటీయూ భవన నిర్మాణ కార్మికుల సమావేశం వడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. రాజ్‌కుమార్ మాట్లాడుతూ, ఏళ్ల తరబడి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఉద్యమాలు చేపట్టామన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయం ముట్టడి చేపట్టామన్నారు. దీనికి ప్రతి కార్మికుడు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చింతల సత్యనారాయణ, గూనూరి రమణ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

చిన్నపాటి వర్షానికే చెరువులుగా రోడ్లు

- పొంగి ప్రవహించిన డ్రైన్లు
- పూడికతీత వల్ల ప్రయోజనం ఏంటి?

సామర్లకోట: పట్టణంలో గురువారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి వర్షానికే అనేక రోడ్లు చెరువులుగా మారాయి. డ్రైన్లు పొంగి ప్రవహించడంతో నీరు రోడ్లపైకి చేరింది. ప్రధాన డ్రైన్లలో ఇటీవల సుమారు రూ.30 లక్షలతో పూడికతీత పనులు జరిగినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. దాంతో పూడికతీత పనుల వల్ల ప్రయోజనం శూన్యం అనే విమర్శలు వినిపించాయి. వర్షపు నీరు డ్రైన్లలోకి పోయే అవకాశం లేకపోవడంతో పట్టణంలోని రోడ్లు చెరువులుగా మారాయి. స్టేషన్ సెంటర్, బస్సు కాంప్లెక్స్, జయలక్ష్మి థియేటర్ రోడ్డు, సత్యనారాయణ పురం రోడ్డు, సంపెంగతోట, వెలమపేట, రథం సెంటర్, షిర్డి సాయిబాబా రోడ్డు, వెలమపేట, సంగీతరావుపేట, సీతారామ కాలనీ, భాస్కర్‌నగర్, కాకినాడ రోడ్లు చెరువులుగా మారాయి. స్టేషన్ సెంటర్‌లో రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అప్పయ్య చెరువు నుంచి డ్రైన్ ద్వారా వచ్చే నీటి ప్రవాహానికి సత్యనారాయణపురం రోడ్డు చెరువుగా మారింది. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి డ్రైన్ల ద్వారా ప్రవహించే నీరు స్థానిక స్టేషన్ సెంటర్‌లోని ప్రధాన డ్రైన్‌లోకి చేరుతోంది. అది నిండిపోవడంతో జయలక్ష్మి థియేటర్ రోడ్డు, స్టేషన్ సెంటర్లు చెరువులను తలపించాయి. బస్సు కాంప్లెక్స్‌లోకి నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.



సామర్లకోటలో చెరువుగా మారిన సత్యనారాయణపురం రోడ్డు



జయలక్ష్మి థియేటర్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి దివీస్ ఫార్మా కంపెనీలో రాగి చోరీ కేసులో ముగ్గురు బీహార్‌వాసులను అరెస్టు చేసినట్టు తొండంగి ఎస్సై జగన్మోహన్‌రావు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 6న దివీస్ కంపెనీలో రాగి చోరీకి గురైంది. దీనిపై యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై దర్యాప్తు చేపట్టారు. కంపెనీలో పనిచేస్తున్న బీహారీలు బిట్టుకుమార్, అభిషేక్ కుమార్, దీపక్ కుమార్ కలిసి 17 వందల కిలోల రాగిని దొంగిలించి విక్రయించారు. దీనికి సంబంధించిన నగదు రూ.6.50 లక్షలు రికవరీ చేసినట్టు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాళ్లరేవు: మారుతున్న వాతావరణ పరిస్థితులలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కోరంగి పంచాయతీ చిన బొడ్డు వెంకటాయపాలెం గ్రామంలో తాళ్లరేవు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఈశ్వర్ ఆదేశాల మేరకు హెచ్‌వి లక్ష్మి, ఏఎన్‌ఎం అచ్యుత, ఎంఎల్‌హెచ్‌పీ సింధూ, హెల్త్ అసిస్టెంట్ అంజనేయులు తదితరులు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ముఖ్యంగా ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉంచకుండా చూడాలని కోరారు. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చినబొడ్డు వెంకటాయపాలెంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది